'ఏమిటో... ఈ సినిమా డైరెక్టర్స్‌కి అసలు మెదడనే ఉండదేమో! నిండా పదహారేళ్లైనా లేని ఈ పసిపిల్లలు ప్రేమించేసుకొని, ఇంట్లోంచి పారిపోయి... ఏం తిని బతుకుతారోనన్న ఇంగిత జ్ఞానమైనా ఉండదు. ఛ...ఛ... ఇలాంటి నాన్సెన్స్ అంతా చూసే యూత్ ఇలా పాడైపోతున్నారు...' టివిలో వస్తున్న ఒకానొక టీనేజ్ లవ్‌స్టోరీని చూస్తూ సీరియస్‌గా వ్యాఖ్యానించాడు శంకరం.

''అదేంటి డాడీ... అలా అంటారు. ఇందాక ఆ అమ్మాయి తన చేతి గాజులమ్మి గేదెను కొందిగా... ఆ పాలమ్ముకొని బతుకుతారెంచక్కా...' నూనూగు మీసాల నూత్న యవ్వనంలోకి అడుగుపెడుతున్న అతడి ప్రథమ పుత్రరత్నం దీపక్ పితృదేవుడికి అర్థమయ్యే రీతిలో వివరించాడు.

వంటగదిలో పని చేసుకుంటూ వీరి సంభాషణను వింటున్న రుక్మిణికి ఒళ్ళు మండింది.

'తిట్టుకుంటూ, తిమ్ముకుంటూ ఆ చెత్తనే చూడకపోతే... ఛానెల్ మార్చచ్చు గదా...' గయ్‌మంది.

రుక్మిణి గొణుకుడు భరించలేక ఛానల్ మార్చాడు శంకరం... బుల్లితెర నిండా అరకొర దుస్తులను ధరించి అందాలొలికిస్తున్న ముంబై హీరోయిన్ కనపడింది ఏదో పని మీద హాల్లోకి వచ్చిన రుక్మిణికి.

చచ్చేంత సిగ్గుగా అనిపించింది ఆమెకి.

'రాన్రాను... ఈ సినిమాలను చూస్తే ఒళ్లు మండుతోంది. పాత సినిమాలెంత బాగుండేవి... పిచ్చి వేషాలు, కుప్పిగంతులు... ఈ కొత్త సినిమాలు చూడలేకపోతున్నాం...' అంది రుక్మిణి.

'చూడ్డం మానేయ్. నిన్నెవరూ బతిమలాడరు...' అన్నాడు శంకరం.

ఇంతలో టీవీ స్క్రీన్ మీద సీన్ మారింది.

ఆ దృశ్యం మారిపోయి నోరంతా తెరిచి ఇకిలిస్తున్న యాంకరమ్మ ప్రత్యక్షమయింది బుల్లితెరపై.

తెలుగు టీవీ ఛానల్స్‌లో యాంకర్స్‌గా పని చేయడానికి కావలసిన ప్రధాన అర్హత తెలుగు సరిగ్గా మాట్లాడ్డం రాకపోవడమే అనిపించక మానదు సదరు యాంకరమ్మను చూస్తే.

'చూశారుగా... ఈ శన్నివేషాన్ని... ఈ సినిమాకి దర్శకుడు ఎవరో ఊహించి... కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్‌పై వ్రాషి... వారం రోజులలోగా మాకు అందేలా పంపండి... లక్కీడిప్‌లో ఎంపికైతే... బోల్డెన్ని బహుమతులు మీ షొంతవండీ...' ముద్దు ముద్దుగా చిలకపలుకులు పలుకుతోంది ఆ యాంకర్.

ఛ...ఛ... వెధవ సినిమాలు. రక్త సంబంధీకులు కూడా రక్తాలోడేటట్లుగా కొట్టుకు చచ్చే సీన్లున్న ఫాక్షన్ సినిమాలు... యాక్షన్ చిత్రాలు... అవీ కాకపోతే... మూతి మీద మీసమింకా మొలవని హీరో... ముఖంలో పసితనం వీడని హీరోయిన్ వీళ్ల మధ్య రీళ్ల కొద్దీ సాగిపోయే లవ్వూ... ఇవి తప్ప మనవాళ్లకి వేరే కథలేవీ దొరకవా...

ఎప్పటికప్పుడు కేబుల్ కనెక్షన్ పీకించి పారేయాలనే అనుకుంటూ ఉంటుంది రుక్మిణి. కాని... సిగరెట్, డ్రింక్, డ్రగ్స్ సేవించడానికి అలవాటు పడిన వాడు... ఆ వేళకి అవి అందకపోతే ఎంతగా చిరాకు పడతాడో... అంతకు రెట్టింపు యాతనగా ఉంటుంది ఆమెకి. వారానికి ఐదు రోజుల పాటు... ప్రసారమయ్యే 'గుండె మంటలు' టివి సీరియల్ చూడకపోతే.

ఈ విషయమై పిల్లలు ఆమెను నిలదీస్తూనే ఉంటారు. 'నీ కిష్టమైన సీరియల్స్ చూస్తావు గాని... మమ్మల్ని మాత్రం మాకిష్టమైన ప్రోగ్రామ్స్ చూడనివ్వవు...' అని.

వాళ్లడిగేది నిజమే అయినా... వారికి సమాధానమిచ్చే శక్తి మాత్రం రుక్మిణికి లేదు.



# సిత్రాలు సూడరో!

**-కె.కె.భాగ్యశ్రీ**

బుల్లి తెర మీద సినిమా చిత్రాలు చూసి... బుర్ర వేడెక్కిపోయి ఉన్న ఆ తరుణంలో ఫోన్ మోగింది 'ట్రింగ్'మంటూ.

వంటింట్లో కథాకళి ఆడుతున్న రుక్మిణి 'ఏమండీ పనిలో ఉన్నాను. కాస్త ఫోన్ తీద్దురూ...' అంటూ శంకరానికి పురమాయించింది.

సణుగుతూనే ఫోన్ లిఫ్ట్ చేసిన శంకరం 'హలో... ఎవరూ... బావా నువ్వా! ఏంటి సంగతి? అందరూ బాగున్నారా... ఎవరూ... మీ చెల్లితో మాట్లాడతావా... ఒక్క నిమిషం. రుక్కూ... నీకే ఫోన్...' అంటూ గొంతు నరాలు తెగేలా అరిచాడు.

అసలే పని తెమలక కొట్టుకు ఛస్తుంటే... వీడూ ఇప్పుడే ఫోన్ చేయాలా? మనసులోనే విసుక్కుని శంకరం చేతిలోంచి ఫోన్ అందుకుంది రుక్మిణి.

'ఏంటిరా అన్నాయ్... ఇప్పుడు ఫోన్ చేశావు? ఇంట్లో అందరూ క్షేమమేనా?' కుశల ప్రశ్నలు వేసింది.

'ఆ... అందరూ బాగున్నారు. నీతో చిన్న పని పడిందే... అర్జంటుగా రాగలవా?' రాఘవ స్వరంలో అభ్యర్థన.

ఇంతకీ సంగతేంటి?' అడిగింది రుక్మిణి.

'ఫోన్‌లో చెప్పేది కాదులే... నువ్వు రేపొద్దున్నే బయలుదేరొచ్చేసేయ్...' ఫోన్ కట్ చేశాడు రాఘవ.

'వీడెప్పుడూ ఇంతే. సస్పెన్స్‌లో పెట్టి ఇవతల వాడి బుర్ర తినేస్తాడు...' విసుగ్గా అనుకుంది రుక్మిణి.

* * *

తెల్లవారుఝామునే లేచి ఫస్ట్ బస్ పట్టుకొని ఊరుకెళ్ళేసరికి తొమ్మిది దాటింది. రాఘవ ఇంట్లోనే ఉన్నాడు. అతడి భార్య కుంతల నయాపైసంత ముఖం చేసుకుని ఉంది. అయినా... ఆడపడుచు మర్యాదలు ఘనంగానే చేసింది రుక్మిణికి.

కాఫీ ఫలహారాలవీ పూర్తయ్యాక 'ఏంటన్నయ్యా.. అంత అర్జంటుగా రమ్మన్నావు. ఏం కొంప మునిగిందోనని హడలి చచ్చాను...' అంది రుక్మిణి.

'ఆ... కొంపే మునిగేట్లుంది. నీ ముద్దుల మేనకోడలి విషయం మాట్లాడ్డానికే రమ్మన్నాను...' అసహనంగా చెప్పాడు రాఘవ.

'ఏం? హరితకేమైంది?' ఆదుర్దా ప్రకటించింది రుక్మిణి.

హరిత ఆమె చేతుల మీదుగానే పెరిగింది. రుక్మిణి పెద్దకొడుకు పుట్టేసరికి హరిత పదినెలల పిల్ల. వచ్చీ రాని ముద్దు మాటలతో ఆమెను వదిలేది కాదు. రెండోసారి కూడా రాఘవ ఇంటి దగ్గరే పురుడు పోసుకోవడం నుండి రుక్మిణికి అత్యంత సన్నిహితురాలై పోయింది.

రుక్మిణి కళ్లల్లో అలముకున్న నీటిపొరను గమనించి 'నువ్వు మరీ ఎమోషనల్‌గా ఫీలవ్వక్కర్లేదు... నే చెప్పింది విన్నాక తీరిగ్గా ఫీలవుదుగాని... హరిత మనకో ప్రాబ్లం క్రియేట్ చేసి పెట్టింది...' చెప్పాడు రాఘవ.

'అబ్బబ్బ... అదేంటో సరిగ్గా చెప్పరా... టివి సీరియల్ లెవల్లో వంద ఎపిసోడ్స్ సాగదీయకు...' చిరాగ్గా అంది రుక్మిణి.

'వాస్తు విరుద్ధంగా ఉందని ఆ మధ్య మన బాత్‌రూం పడగొట్టించి కొత్తగా కట్టించినప్పుడు తాపీపని చేయడానికి ఒక అబ్బాయి వచ్చాడు' రాఘవ ఆగాడు.

'అయితే...' అయోమయంగా అడిగింది రుక్మిణి.

'నీ ముద్దుల మేనకోడలు వాడిని ప్రేమించిందిట... పెళ్లంటూ చేసుకుంటే అతడినే చేసుకుంటానని పట్టుపట్టి కూర్చుంది. తల బద్దలు కొట్టుకు ఆలోచించినా ఏం చేయాలో తోచలేదు. నువ్వైతే మంచి సలహా ఇస్తావనీ...' దీర్ఘంగా నిట్టూర్చాడు రాఘవ.

స్టన్ అయిపోయింది రుక్మిణి. నిండా పదహారు లేవు దానికి... అప్పుడే ప్రేమా! దీన్నీ దోమెప్పుడు కుట్టింది.

'అవును రుక్కూ... నువ్వంటే దానికి ఇష్టం. నీ మాట కాదనదు. దాని బుర్రలో తుప్పు వదలగొడతావని నిన్ను రమ్మన్నాం. గట్టిగా మందలిద్దామంటే భయం... అది ఏమైనా అఘాయిత్యం చేస్తుందేమోననీ...' భయంగా అంది కుంతల.

'మీరేం వర్రీ అవకండి. నేను ఈ సమస్యను సాల్వ్ చేస్తాను...' అభయం ఇచ్చింది రుక్మిణి.

* * *

'అత్తా' కాలేజీ నుండి వస్తూనే రుక్మిణిని చుట్టుకుపోయింది హరిత.

'ఏరా హరీ... బాగున్నావా?' దాని తల నిమిరింది రుక్మిణి ఆప్యాయంగా.

'వెరీ ఫైన్... బావలెలా ఉన్నారు?' అడిగింది హరిత.

'నిక్షేపంగా ఉన్నారు...' అంది రుక్మిణి.

ఇద్దరూ హరిత గదిలో కూర్చున్నారు. గది గోడలకు రంగురంగుల ప్రకృతి దృశ్యాలు, దేశ నాయకుల ఫొటోలు ఉండేవి ఇదివరలో... కాని ఇప్పుడు ఆ స్థానాన్ని అనేక మంది స్వదేశీ విదేశీ హీరోలు, క్రికెటర్స్ ఆక్రమించుకుని ఉన్నారు అంగుళం ఖాళీ కూడా లేకుండా.

'హరీ... నాన్నేదో చెబుతున్నాడు. నిజమేనా?' విషయాన్ని కదిలించింది రుక్మిణి నెమ్మదిగా.

అంతే... మైకం వచ్చిన దానిలా ఆమె ఉన్నచోటే కూర్చుండిపోయింది. కళ్లు అరమోడ్పులయ్యాయి. తెలుగు సినిమా హీరోయిన్‌లా పెదవి మునిపంట నొక్కుతూ చున్నీని చేతివేళ్లకి బ్యాండేజ్‌లా చుట్టేస్తోంది.

'అవునత్తా... నేను యాదగిరిని ప్రేమించాను...' చెప్పింది హరిత అనవసరంగా మెలికలు తిరుగుతూ.

'యాదగిరి అంటే...' అర్థమయినా కానట్లు అడిగింది రుక్మిణి.

'యాదగిరి తాపీ పని చేస్తాడు. మనింట్లో పని కొచ్చినప్పుడు పరిచయం. ఎంత బాగుంటాడో తెలుసా! 'కహోనా ప్యార్ హై'లో హృతిక్‌లా ఉంటాడు. ఆ హెయిర్ స్టైల్, ఆ బాడీ...' తన్మయత్వంగా చెప్పుకుపోతోంది హరిత.

అణువణువున ప్రకోపించిన ప్రేమ పైత్యం ఆమె చేత అలా పలికిస్తోంది.

'కాని హరీ... ఏ రోజు కూలి డబ్బులు ఆ రోజు తెచ్చుకుంటే గాని వాళ్లకి పూట గడవదు. నువ్వా... ముద్దుగా పెరిగావు. క్షణంసేపు ఫ్యాన్ తిరగకపోతే గిలగిలలాడతావు. వాళ్ళిళ్లల్లో నీక్కావలసిన సౌకర్యాలేమీ ఉండవు...' అనునయంగా పలికింది రుక్మిణి.

'నిజమైన ప్రేమకు ఇవేమీ అడ్డురావత్తా... యాదగిరి తోడుంటే నేనే ఇబ్బందులనైనా ఫేస్ చేస్తాను...' భారీ లెవెల్లో హరిత వదులుతున్న డైలాగ్‌లకి మతిగతి తప్పింది రుక్మిణికి.

'లాభం లేదు... శృతి మించి రాగాన పడింది... ఈ తెగులు సమూలంగా నాశనం చేసేందుకు పవర్‌ఫుల్ ప్లానే వేయాలి...' అనుకుంది రుక్మిణి.

* * *

రాఘవ, కుంతలలతో తాను చేయాలనుకున్నది చెప్పింది రుక్మిణి. మొదట కాస్త సంశయించినా చివరకు ఒప్పుకున్నారు వాళ్లు.

'ఇదేంటత్తా... ఇక్కడకు తీసుకొచ్చావు' చుట్టూ పరిసరాలను పరిశీలిస్తూ అదోక రకంగా ముఖం పెట్టింది హరిత.

'మరి... నువ్వు కాపురం చేయబోయే ఇల్లెలా ఉంటుందో తెలుసుకోవాలిగా...' అంది రుక్మిణి ఆమె ముఖంలో మారే రంగులను పరికిస్తూ.

మాట్లాడలేదు హరిత కాస్సేపటిదాకా.

'ఓరమ్మా... మీరు... ఇట్టా వొచ్చినారేటి?' అడిగింది ఒకామె.

తాము ఎవరమో, ఎందుకొచ్చామో ఆమెకు అర్థమయ్యేలా చెప్పింది రుక్మిణి.

అంతే... ఆమె గుడ్లు పెద్దవి చేసి చూస్తూ 'ఓలమ్మోలమ్మ... ఏటమ్మా... ఈ యిడ్డూరం... మీరేటీ... మాతో సమ్మందం కలుపుకోడమేటీ... అంతా సిత్రంగా ఉంది...' అంది బుగ్గలు నొక్కుకుంటూ.

రుక్మిణి ఆమె మాటలకు బదులు పలక్కుండా చుట్టూ చూసింది.

అపరిశుభ్రంగా ఉన్న పరిసరాల్లోంచి... ఒళ్లు విరుచుకుని నిద్ర లేచిన దోమలు... పెద్ద సెనగబద్ద సైజులో ఉండి... వాళ్ళ మీద వాలి వారి రక్తాన్ని కోకాకోలా లెవెల్లో జుర్రేస్తున్నాయి.

'అబ్బ... హుస్...' అనుకుంటూ వాటిని అదిలించాలని చూస్తోంది హరిత అసహనంగా అటూ ఇటూ కదులుతూ.

మరొక గంట గడిచాక అక్కడి సీను మారింది. యాదగిరి ఇంటికొచ్చాడు. కుర్రాడు మట్టిలో మాణిక్యంలా ఉన్నాడు... కాని జీవితం సాఫీగా సాగిపోవడానికి అందమొక్కటే సరిపోదు గద.

వీళ్ల వైపు ఆశ్చర్యంగా చూస్తూ తల్లిని లోపలికి పిలిచి ఏదో అడిగాడు. ఆమె ఏం చెప్పిందో, ఏమో బయటకు వచ్చి, నులక మంచం వాల్చుకు కూర్చున్నాడు.

ఇంతలో అతడి తల్లి ప్లేట్లో ఎర్రగా ఉన్న పదార్థమేదో తెచ్చి పెట్టింది.

యాదగిరి లేచి సైకిల్‌కి తగిలించి ఉన్న సంచీలోంచి ఏదో పాకెట్ తీసుకుని వచ్చి, అందులోని ద్రవాన్ని వారి కళ్ల ముందే నోట్లో పోసుకున్నాడు.

'ఏంటది? మినరల్ వాటరా?' ఆసక్తిగా అడిగింది హరిత.

'కాదు... సారా పొట్లం... పొద్దల్లా కట్టపడి వొళ్లు హూనమయిద్ది... ఈ సుక్కేత్తే గాని ఆ నొప్పులు పోవు...' అన్నాడు యాదగిరి ప్లేట్లోని పచ్చడి చేత్తో తీసి నాకుతూ.

'నువ్వు తాగుతావా....' ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టింది హరిత.

'ఆ... మరి. రేపొద్దున్న నన్ను మనువాడాక కూడా దీన్ని నే మానను. నువ్వు నా రెండో పెల్లానివి...' తాగడం పూర్తి చేసిన యాదగిరి చెప్పాడు.

షాక్ తిన్నట్టుగా చూస్తోంది హరిత. ఇంతలో యాదగిరి తల్లి రెండు స్టీలు గ్లాసుల్లో ఏదో ద్రవాన్ని తెచ్చి వారి ముందుంచింది.

'ఏంటిది?' అడిగింది రుక్మిణి.



'అప్పన్న కొట్టుకాడ మీ కోసం పెసలు టీ సేయించుకొచ్చాను...' అంది గొప్పగా.

తనకొద్దని చెప్పేసి హరిత వైపు చేయి చూపించింది రుక్మిణి.

వెగటుగా ముఖం పెట్టి ఆమె వైపు చూసింది హరిత.

'తీసుకో... రేప్పొద్దున్న ఇదే తాగి బతకాలి...' అంది రుక్మిణి.

తప్పదన్నట్టుగా గ్లాసందుకుని, ఒక్క గుక్క తాగి వాంతి చేసుకున్నంత పని చేసింది హరిత.

రుక్మిణి గుంభనగా నవ్వుకుంది ఆమెను చూస్తూ.

బెంబేలెత్తిపోయినట్టుగా రుక్మిణి వైపు చూస్తూ 'పదత్తా మనింటికి వెళ్ళిపోదాం...' ఏడుపొక్కటే తక్కువైన హరిత అంది కంగారుగా.

**'చూడు హరీ... నీది ఎడాలిసెన్స్... పై మెరుగులు చూసి భ్రమపడటం కాదు ప్రేమంటే... సినిమాలను చూసి అనుకరించిన దాన్ని ప్రేమనరు. ప్రేమ... ఒక మధుర భావన... అది ఆకర్షణకీ, ఆడంబరాలకీ అతీతం...**

'అదేంటి... ప్రేమ కోసం ఏ కష్టాన్నైనా ఫేస్ చేస్తానని నువ్వేగా చెప్పావు. ఇంతలో ఏమైంది?' ఆమె రియాక్షన్ కోసం ఎదురు చూసింది రుక్మిణి.

'ప్రేమ లేదు... దోమా లేదు.. మనింటికి పోదాం పద...' అంది హరిత బయటకు దౌడు తీస్తూ.

నవ్వుకొని ఆమె ననుసరించింది రుక్మిణి.

'చూడు హరీ... నీది ఎడాలిసెన్స్... పై మెరుగులు చూసి భ్రమపడటం కాదు ప్రేమంటే... సినిమాలను చూసి అనుకరించిన దాన్ని ప్రేమనరు. ప్రేమ... ఒక మధుర భావన... అది ఆకర్షణకీ, ఆడంబరాలకీ అతీతం...

కేవలం రెండు గంటలపాటు ఆ వాతావరణంలో ఇమడలేకపోయిన దానివి... జీవితాంతం ఎలా ఉండగలవు?

నేను వారి జీవన విధానాన్ని వెక్కిరించడం లేదు... ఎత్తి చూపడమూ లేదు. ఎవరి ఆర్థిక స్థాయిని బట్టి వారు జీవిస్తారు... కాని మనలాంటి వారు కోరి అందులో అడుగుపెడితే కష్టనష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నాను.

ముందు చదువు మీద దృష్టి పెట్టు. అనుకున్నది సాధించు. ఆ తరువాతే మిగిలినవన్నీ...

వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది రుక్మిణి. మెత్తమెత్తగా చీవాట్లు పెట్టి హరిత తలదించుకునేలా చేసింది.

అపరాధిలా చూస్తూ నిలబడిన హరితను దగ్గరకు తీసుకుని తల నిమిరింది లాలనగా.

'అత్తా...' బావురుమంది హరిత.

'థాంక్స్ చెల్లాయ్. కీలెరిగి వాత పెట్టావు.. నీ మాట అది కాదనదనే నిన్ను రమ్మన్నాను...' అభినందించాడు రాఘవ.

'మరేమనుకున్నావ్ ఈ రుక్మిణంటే...' గర్వంగా తలెగరేసి నవ్వింది రుక్మిణి.

* * *

'ట్రింగ్... ట్రింగ్...' రాఘవ బలవంతం మీద మరొక రెండు రోజులుండి పోయిన రుక్మిణి ఆ కాల్ కచ్చితంగా తన ప్రాణనాథుడి దగ్గర నుండేనని ఊహించింది.

రిసీవర్ తీసి చెవి కానించుకోగానే శంకరం చదువుతున్న దండకం చెవిన పడింది.

'నీకసలు బుద్ధుందా! ఇల్లూ వాకిలీ ఏమైందో పట్టించుకోక ఎన్నాళ్ళు పుట్టరికం చేస్తావు...' రంకెలు వేయసాగాడు శంకరం.

'ఇదిగో... వచ్చిన పనై పోయింది. రేపే బయల్దేరతాను...' అతడిని శాంతింపజేయ చూసింది రుక్మిణి.

'బయల్దేరి తీరాలి... పెద్దాడికి విపరీతమైన జ్వరం... డాక్టర్ టైఫాయిడ్ అని చెప్పాడు... ఇంటా బయటా చేయలేక ఛస్తున్నాను. ఎలాగైనా రేపొచ్చేసేయ్' తన కోపాన్ని రిసీవర్ మీద చూపిస్తూ 'ధన్'మన్న శబ్దంతో పెట్టేశాడు శంకరం.

కాళ్ళు చేతులు ఆడక తెల్లారగానే పరిగెత్తుకొచ్చింది రుక్మిణి. మంచానికి బల్లిలా అంటుకుపోయిన పెద్దకొడుకుని చూస్తే కడుపు తరుక్కుపోయింది ఆమెకి.

ఆ సాయంత్రం పక్కింటి వాళ్ళమ్మాయి పల్లవి వీళ్లింటికి వచ్చింది.

ఆ అమ్మాయి దీపక్ తోడిదే. ఇద్దరూ ఒకే క్లాస్ చదువుతున్నారు. వస్తూనే తన గుప్పెట తెరచి అందులోని కుంకుమను తీసి దీపక్ నుదుటను పెట్టింది.

'ఏమే పల్లూ... నీ ఫ్రెండ్‌కి ఒంట్లో బాగు లేదని గుళ్లో పూజ చేయించుకుని వచ్చావా... నీ భక్తికి మెచ్చి దేవుడు నీ ఫ్రెండ్ జ్వరం ఇట్టే తగ్గించేశాడు చూశావా' అంది రుక్మిణి దీపక్ పట్ల ఆమెకున్న అభిమానాన్ని, స్నేహభావానికి ముగ్ధురాలై పోతూ.

'దీపూకి జ్వరం తగ్గింది. దేవుడి దయ వల్లనే కాదత్తా... వీడి మీద నాకున్న ప్రేమ బలం వలన కూడా...' అంది పల్లవి మైకంలో తేలిపోతూన్నట్టుగా చూస్తూ.

పక్కలో బాంబు పడినట్టుగా అదిరిపడింది రుక్మిణి. ఆ అమ్మాయి ముదురు కబుర్లకి నోరెళ్ళబెట్టింది.

పీక్కుపోయిన ముఖంతో... పల్లవినే ఆరాధనగా చూస్తున్నాడు దీపక్.

నిశ్చేష్టురాలైంది. అందరికీ శకునాలు చెప్తూ తానే కుడితి తొట్టెలో పడిందట ఓ బల్లి. అలా ఉంది తన పరిస్థితి.... ముందు తనింట్లో పరిస్థితి గమనించకుండా అన్నయ్య కూతుర్ని సరిదిద్దడానికి బయలుదేరింది గురిగింజలా.

ఈ పసివాళ్ల హృదయాల్లో ఇంత దారుణమైన భావాలు నెలకొని ఉన్నాయని గ్రహించలేకపోయింది... తన ఇల్లు ముందు సంస్కరించుకుంటే ఒకరికి నీతులు చెప్పే అర్హత వస్తుంది.

ప్రక్షాళనా కార్యక్రమం ముందుగా తమింటితోనే మొదలు పెట్టాలి.

ఒక స్థిర నిశ్చయానికి వచ్చిన రుక్మిణి కేబుల్ ఆపరేటర్‌కి ఫోన్ చేసింది కనెక్షన్ తొలగించమని. ఇక ముందు సినిమాలు చూపించడం కూడా బంద్ చేయాలి... మనసులోనే తీర్మానించుకుని పల్లవి, దీపక్‌లను సరసన కూర్చుండబెట్టుకుని వారి పసి మనసులకి అర్థమయ్యే రీతిలో 'బ్రెయిన్ వాష్' ప్రారంభించింది రుక్మిణి.

★